క్లుప్తంగా

కేజీబీవీ సందర్శన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: హిరమండలం మండల కేంద్రంలోని కేజీబీవీని ఎంఈవో కె.రాంబాబు శుక్రవారం సందర్శించారు. పాఠశాలకు చెందిన పలు రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థినులు సీజనల్ వ్యాధులబారిన పడకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కేజీబీవీ ఎస్‌వో ఎస్.కృష్ణవేణి, ఉపాధ్యాయినులు ఉన్నారు.

పాతపట్నం ఇన్‌చార్జి ఈవోగా దిలీప్‌కుమార్



పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి ఈవోగా డి.దిలీప్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఇప్పుడు పూర్తి అదనపు బాధ్యలతో ఈవోగా బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పనిచేసిన ఈవో టి.కూర్మారావు మెడికల్ లీవ్‌లో ఉన్నందున ఈయనకు బాధ్యతలు అప్పగించామని ఎంపీడీవో కె.రామక్రిష్ణరాజు తెలిపారు.

హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడికి సత్కారం



డాక్టర్ శ్రీధర్‌ను సత్కరిస్తున్న యువకులు

హిరమండలం: హిరమండలం మండల కేంద్రానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు శ్రీధర్ చేసిన సేవలను గుర్తించి ఈ నెల 15 తేదీన యూఎస్ఏకు చెందిన డేస్ప్రింగ్ అంతర్జాతీయ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ఊటీలో ప్రదానం చేసింది. డాక్టరేట్ అందుకున్న ఆయన శుక్రవారం హిరమండలం వచ్చారు. ఈ సందర్భంగా శ్రీధర్‌కు అసోసియేషన్ సభ్యులు, స్థానిక యువత పెద్ద ఎత్తున ఘనస్వాగతం పలికారు. ఊరేగింపుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎంజీఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

తమ్మినేని పరామర్శ



పరామర్శలో సీతారాం తదితరులు

సరుబుజ్జిలి: మర్రిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పున్నపు రెడ్డి తవిటినాయుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మర్రిపాడు గ్రామానికి శుక్రవారం వెళ్లి తవిటినాయుడును పరామర్శించారు. ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శలో జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ జి.వి.శివానందమూర్తి, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కావిలాపు చంద్రశేఖర్, నాయకులు మూడడ్ల రమణ, గౌరీనాయుడు, వాకముల్ల రమణ ఉన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే ఆరోగ్యం



ర్యాలీ చేస్తున్న మహిళలు

కొత్తూరు: సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వెలుగు సీసీలు కృష్ణవేణి, అరుణజ్యోతి అన్నారు. పారిశుద్ధ్య పక్షోత్సవాల్లో భాగంగా కొత్తూరులో అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వెలుగు ప్రతినిధులు చంద్రరరావు, పుష్ప, గౌరీఈశ్వరి, వీఏవోలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకలు రేపు

హిరమండలం: గురుపౌర్ణమి పర్వదినానికి మండలంలోని సాయిబాబా మందిరాలు ముస్తాబవుతున్నాయి. మేజర్ పంచాయతీ హిరమండలం పెద్దకోరాడ, బ్యారేజీ సెంటర్, హిల్‌కాలనీలో ఉన్న షిర్డీసాయిబాబా మందిరాల్లో పౌర్ణమి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వేడకల్లో భాగంగా బాబాకు కాకడహారతి, అభిషేకాలు, విశేష పూజలు, మహాహారతి, ప్రసాద వినియోగం, సహస్రనామ పారాయణం, సంధ్యాహారతి, భజనలు, పల్లకిసేవా వంటి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులకు అన్నదానం చేస్తామన్నారు.

విద్యా కుసుమాలు!

వికసించిన

- ట్రిపుల్ ఐటీకి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఎంపిక
- ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు



పాతపట్నం ప్రభుత్వ మోడల్ స్కూల్

పాతపట్నం: పేదింటి విద్యా కుసుమాలు విరబూశాయి. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పించడంతో చదువులో రాణించారు. అత్యధిక మార్కులతో టాపర్లుగా నిలిచారు. అలాంటి వారి భవితకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ట్రిపుల్ ఐటీలు దివిటీలుగా నిలిచాయి. ప్రతిష్టాత్మక నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి పాతపట్నం నియోజకవర్గానికి చెందిన పలువురు విద్యార్థులు అర్హత సాధించారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ కోర్సు చదివేందుకు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలిజీస్ (ఆర్‌జేయూకేటీ)లో అడ్మిషన్లు పొందారు.

ఎంపికైన విద్యార్థులు వీరే

పాతపట్నం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన బూడిత జోత్స్న, అనిల్ కుమార్ ప్రధాన్, పిచ్చుక ప్రశాంత్, పాతపట్నం ప్రభుత్వ మోడల్ స్కూల్‌కు చెందిన రాజేష్ ప్రధాన్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. అలాగే హిరమండలం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన గొల్లంకి ఉదయ్‌కుమార్, బత్తుల మణి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సంపాదించారు. హిరమండలం కేజీబీవీకి చెందిన విద్యార్థినులు కూర్మాన ఉమాదేవి, వంజరాపు శ్రావ్యలు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో స్థానం పొందారు. ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కరణం రాహుల్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికవ్వగా.. కొత్తూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన బుయ్యాల నీలమ, నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బి.సాయిచరణ్, దిండిమ ప్రియదర్శిని, యజ్జల జోత్స్న, కౌముది రంజిత, కడుము జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కిల్లారి దీక్షిత్‌శ్రీ, మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఎంపికైయ్యారు. వీరితోపాటు మెళియాపుట్టి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన సుభశ్రీ జెన్నా, కొసమాల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మామిడి సోనియా, బొయిన లాలస, క్రాంతి కిరణ్, ఎస్.గోపాల్, ఎం.షణ్ముఖరావు, జి.హేమసుందరరావు, తులసీ కుంటియా, చాపర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జె.హేమలత, పెద్దలక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన చింతాడ కీర్తి, గొప్పిలి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అంజలి శ్యామల్, పెద్దమడి గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన పాలక జోత్స్న, సవర యామిని, సవర నందిని, సవర రూప నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పొందారు. వీరిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

హెచ్‌ఎం ప్రోత్సాహంతో ఎంపికయ్యా..



పాతపట్నం పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివాను. టెన్త్‌లో 566 మార్కులు వచ్చాయి. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపియ్యాను. టెన్త్‌లో మంచి మార్కులు తెచ్చుకుంటే ట్రిపుల్ ఐటీలో సీటు వస్తుందని, భవిష్యత్ బాగుంటుందని హెచ్‌ఎం వైకుంఠరావు ప్రోత్సహించేవారు. కంప్యూటర్ ఇంజినీర్ కావాలని అనుకుంటున్నాను.

–బూడిత జోత్స్న, కాగువాడ, పాతపట్నం మండలం

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా..



హిరమండలం కేజీబీవీలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివాను. టెన్త్‌లో 572 మార్కులు వచ్చాయి. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పాటు పట్టుదలతో చదివాను. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాను. బాగా చదివి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలన్నదే లక్ష్యం.

–కూర్మాన ఉమాదేవి, అంగూరు, హిరమండలం మండలం

విద్యార్థులను పోత్సహించాలి



పదో తరగతి చదువుతున్నప్పుడే విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యేలా ప్రణాళిక బద్ధంగా చదివించాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

–ఎస్.వైకుంఠరావు, హెచ్‌ఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాతపట్నం

హెల్మెట్ విధిగా వాడాలి

- జడ్జి తేజ చక్రవర్తి మల్ల



పాతపట్నం వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి తేజచక్రవర్తి మల్ల

పాతపట్నం: వాహనదారులు విధిగా హెల్మెట్ వాడాలని పాతపట్నం కోర్టు ఇన్‌చార్జి, టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్ల అన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కలిగే ప్రమాదాలపై పాతపట్నం సబ్ జైల్, మహేంద్ర జూనియర్ కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ లేకుండా ప్రయాణాలు సాగించి ప్రమాదాలకు గురైన వారిలో అత్యధికంగా యువతే ఉంటున్నారన్నారు. అనంతరం ఆల్‌ఆంధ్ర రోడ్డు కూడలి వద్ద వాహనదారులకు హెల్మెట్ విధిగా వాడాలని, వాహనం నడుపుతూ సెల్‌లో మాట్లాడ వద్దు అని అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, డైరెక్టర్ ఎస్.మధుబాబు, న్యాయవాదులు గేదెల సూర్యం, దాలయ్య, ఎం.రమణ, ప్రకాశరావు, రామకృష్ణ, ప్రిన్సిపాల్ ఎం.అంజనేయులు, సబ్‌జైల్ సూపరింటెండెంట్ రాము, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు బాసట



దత్తత తీసుకున్న పిల్లలతో ఎస్‌వీసీటీ ప్రతినిధులు

నరసన్నపేట: తల్లిదండ్రులు, తల్లి లేని అనాథ విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నామని స్థానిక వజ్రమ్మ చారిటబుల్ ట్రస్టు సభ్యులు టంకాల రాజ్‌కమల్, కోరాడ రవీంద్ర తెలిపారు. ఇటువంటి పిల్లలకు ఏటా రూ. పది వేల విలువైన పుస్తకాలు, పౌష్టికాహారం అందిస్తామన్నారు. ఇటువంటి 30 మంది పిల్లలను దత్తత తీసుకుంటున్నట్లు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్‌వీసీటీ కార్యాలయం వద్ద గుర్తించిన పిల్లలకు నోట్ పుస్తకాలు, బ్యాగులు, న్యూట్రిషన్ పౌడర్‌తో పాటు లోదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే అనాథ పిల్లలకు అండగా ఉంటామన్నారు. మొదటి విడతగా 7, 8 తరగతులకు చెందిన 15 మంది అమ్మాయిలకు, 15 మంది అబ్బాయిలను దత్తత తీసుకున్నట్లు వివరించారు. వారధి ప్రాజెక్టు పేరున సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో ప్రతినిధులు భమిడపాటి అరుణశ్రీ, సంధ్యారాణి, కె.మీరా, పరమాత్మానంద స్వామిజీ, పడాల చారిటబుల్ ట్రస్టు సీఈఓ సూర్యప్రసాద్, స్థానిక ఎస్‌వీసీటీ సిబ్బంది రమేష్, రామారావు, కరుణశ్రీ, దివ్య, శ్రీదేవి పాల్గొన్నారు.

వర్షానందం



సరుబుజ్జిలి: సరుబుజ్జిలి ఏబీ రోడ్డు జంక్షన్ వద్ద నిలిచిన వర్షం నీరు



కొత్తూరు: కొత్తూరు–పాలకొండ రోడ్డులో నిలిచిపోయిన వరద




పాతపట్నం: పాతపట్నంలో కురుస్తున్న వర్షం



సారవకోట: పంట పొలంలో చేరిన వర్షపు నీరు

సరుబుజ్జిలి, కొత్తూరు, పాతపట్నం, సారవకోట: వాయుగుండం ప్రభావంతో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం రోజంతా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకూ సరైన వర్షాల్లేక వెదలు, వరినార్లు వేసిన రైతులు ఆందోళన చెందారు. తాజాగా కురిసిన వర్షంతో పొలాల్లో నీరు చేరడంతో ఊపిరి పీల్చుకున్నారు. భారీగా కురిసిన వర్షంతో సరుబుజ్జిలిలోని ఏబీరోడ్డు జంక్షన్ జలమయమైంది. కొత్తూరు మండలంలోని పలు గెడ్డలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఈ మండలంలో శుక్రవారం 26.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో బాలరాజు తెలిపారు. అయితే భారీగా కురుస్తున్న వర్షంతో పత్తిపంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కొత్తూరు రైతులు చెబుతున్నారు. పాతపట్నం మండలంలో కూడా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఇక్కడ 23.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.ఎస్.వి.వి.ప్రసాదరావు తెలిపారు. వర్షాలు ఇంకా కొనసాగితే పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని సింగిపురం, లాబర, కొరసవాడ, బోరుబద్ర, కాగువాడ, పెద్దలోగిడి, చిన్నమల్లిపురం గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చెందుతున్నారు. సారవకోట మండలంలో కూడా విస్తారంగా వర్షం కురిసింది. పంట పొలాల్లో నీరు చేరింది.

ముమ్మరంగా వరి నాట్లు



నీలాదేవిపురంలో నాట్లు వేస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పొలాల్లో నీరు చేరింది. దీంతో రైతులు వరినాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. నీలాదేవిపురం, బూర్జ, మదనాపురం, అల్లిన గ్రామాల్లో పొలాలను దమ్ము చేసే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. వర్షాలు పడటంతో పాటు నాగావళి వరద కాలువ నీరు విడిచిపెట్టడంతో నాట్లు వేసేందుకు అనుకూలంగా ఉంది.

సక్రమంగా సామాజిక తనిఖీ

సరుబుజ్జిలి: ఉపాధిహామీ పథకం ద్వారా చేసిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ సక్రమంగా నిర్వహించాలని డ్వామా ఏపీడీ పంచాదిరాధ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సామాజిక తనిఖీ సమన్వయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. తనిఖీల సమయంలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. సమావేశంలో పీఆర్ ఏఈ చింతాడ మణికుమార్, విజిలెన్స్ ఏపీవో అరుణ్‌కుమార్, ఏపీవో పార్వతి పాల్గొన్నారు.

23 నుంచి ఆధార్ నమోదు మెగా డ్రైవ్

కొత్తూరు: ఆధార్ నమోదు, అప్‌డేట్ మెగా డ్రైవ్‌ను ఈ నెల 23 నుంచి 27 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో త్రివిక్రమరావు శుక్రవారం తెలిపారు. మదనాపురం, బలద, నేరడి, కొత్తూరు–1 గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు ఉంటాయన్నారు. 23న సోమరాజపురం, 24న బమ్మిడి, 25న గురండి, 26న నివగాం, 27న మాతల ప్రభుత్వ పాఠశాలలో క్యాంపులు ఉంటాయన్నారు. మండల వ్యాప్తంగా ఇవే తేదీల్లో కేటాయించిన అధికారి సమక్షంలో ఆధార్ ప్రక్రియ ఉంటుందని..ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక కమిటీలు

నరసన్నపేట: జిల్లాలో వంశధార నదీ తీరంతో పాటు ఇతర ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక తరలింపు నివారించడానికి ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. జీఓ ఎంఎస్ నంబర్ 43 ప్రకారం జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్, డివిజనల్, మండల స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసినట్లు గనులు, భూగర్భశాఖాధికారి ఎస్‌కేవీ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన చేశారు. ఈ నెల 17న సాక్షి జిల్లా పేపర్లో 'లుకలాంలో ఇసుక అక్రమ తరలింపు' అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి స్పందించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కమిటీలు ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై తగు చర్యలు తీసుకుంటాయని తెలిపారు. దీంట్లో భాగంగా శ్రీకాకుళం ఆర్డీఓ రంగయ్యతో కలిసి నరసన్నపేట, ఆమదాలవలస మండలాల్లో నదీ పరివాహక ప్రాంతాల్లో గల ప్రదేశాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. అదే విధంగా మండలాల్లో తహసీల్దార్లకు అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా నిలుపుదలపై నదికి పోయే మార్గాల్లో కందకాలు తవ్వించమని ఆదేశించినట్లు తెలిపారు. ఇసుక పోగులను సీజ్ చేసి తమ ఆధీనంలో ఉంచాల్సిందిగా సూచించినట్లు పేర్కొన్నారు.

ఎల్సీడీసీ సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న సురేష్‌కుమార్

జలుమూరు: కుష్టురోగులను గుర్తించేందుకు చేపడుతున్న ఎల్సీడీసీ సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిప్యూటీ పారా మెడికల్ అధికారి వాన సురేష్‌కుమార్ సిబ్బందికి సూచించారు. టెక్కలిపాడు గ్రామంలో శుక్రవారం చేపట్టిన సర్వేను పరిశీలించారు. ఇంటింటా సర్వేలో భాగంగా అనుమానిత కేసులను పీహెచ్‌సీ వైద్యాధికారికి తెలియజేయాలన్నారు. సీహెచ్‌ఓ స్వాతి, ఆరోగ్య కార్యకర్త ఆదిలక్ష్మి ఉన్నారు.

పెరుగుతున్న రాజకీయ హత్యలు

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నాయకుల ప్రోత్సాహంతో రాజకీయ హత్యలు పెరిగిపోతున్నాయని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు వివిధ సందర్భాల్లో జరిగిన బహిరంగ సభల్లో నారా లోకేష్ చెప్పినట్లు రెడ్ బుక్ రాజ్యాంగం రాష్ట్రంలో నడుస్తోందన్నారు. రెండు రోజుల క్రితం జరిగిన రషీద్ హత్యను వ్యక్తిగత కక్షలుగా చూపించటం రెడ్ బుక్ రాజ్యాంగమే అని ఆరోపించారు. పట్టపగలు అందరూ చూస్తుండగా హత్యలు చేయటం, భయాందోళనలు సృష్టించటం, శాంతి భద్రతలను రాజకీయ నాయకుల చేతుల్లోకి తీసుకోవటం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని తప్పుపట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరులో పర్యటించేందుకు వెళితే ఆయనపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడులు చేయటం బాధాకరమన్నారు. 45 రోజుల పాలనలో జరిగిన అనేక సంఘటనలు చూస్తే రాష్ట్రంలో ఆటవిక పాలన కొనసాగుతోందన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తాజాగా జరుగుతున్న సంఘటనలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మహిళలు మిస్సింగ్ అని తప్పుడు ప్రచారం చేసి ఆందోళన వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అతి తక్కువ రోజుల్లోనే చిన్నారులు, మహిళలపై జరిగిన లైంగిక దాడులు, హత్యలపై ఎందుకు స్పందించటం లేదన్నారు. దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం



బూర్జ: మాట్లాడుతున్న అధికారులు



నరసన్నపేట: మాట్లాడుతున్న నాగమణి



జలుమూరు: మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

బూర్జ: ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎస్.వి.అంబేడ్కర్, ఎంపీడీవో యూ.శ్రీనివాసరావు అన్నారు. పోష్ 2013, డీఎస్ఎస్ 2023 చట్టాలపై స్థానిక ఎంపీడీవో కార్యాలయములో సీడీపీవో ఎస్.గీత అధ్యక్షన ఒక రోజు శిక్షణ శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. పోష్ చట్టంపై వెలుగు, వైద్య, అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. అలాగే మహిళా ఉద్యోగినులపై లైంగిక వేధింపుల నిరోధం కోసం తీసుకొచ్చిన డీఎస్ఎస్ చట్టంపై కూడా అవగాహన కల్పించారు. చట్టాల అమలు కోసం గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమములో ఎంఈవో పి.ధనుంజయరావు, ఈవోపీఆర్డీ పి.విజయలక్ష్మి, ఏపీఎం బాబూరావు, హెల్త్ సూపర్‌వైజర్లు ఉన్నారు.

జలుమూరు: మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని తహసీల్దార్, సీహెచ్ నాగమ్మ, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళలపై లైంగిక వేధింపులు–చట్టాలు అనే అంశంపై స్త్రీ సంక్షేమ శాఖ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థినుల నుంచి ఉద్యోగం, పని చేసే చోట ఎవరైనా వేధింపులకు గురైతే సంబంధిత అధికారితోపాటు పోలీసుల సహాయం తీసుకోవాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి బి.మాధవరావు, ఐసీడీఎస్ పర్యవేక్షులు సునీత, సీతారత్నం పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులు ధైర్యంగా ఉండవచ్చు

నరసన్నపేట: ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే మహిళా ఉద్యోగుల కోసం నూతనంగా తీసుకువచ్చిన చట్టం రక్షణగా ఉంటుందని నరసన్నపేట ఐసీడీఎస్ పీఓ నాగమణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళలు పనిచేసే ప్రదేశాల్లో వేధింపులపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు నిర్భయంగా పనిచేసుకోవచ్చని అన్నారు. ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే సంబంధిత అధికారులకు, మండల స్థాయిలో ఉన్న నోడల్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. నరసన్నపేట, పోలాకి ఎంపీడీవోలు రామకృష్ణ, ఉషాశ్రీ, పోలాకి ఈవోపీఆర్డీ బి.పద్మావతి, నరసన్నపేట ఏపీవో యుగంధర్, న్యాయవాది ప్రగడ ఆనందరావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మెలకువలు పాటిస్తే అధికదిగుబడి



మాట్లాడుతున్న డీపీఎం ధనుంజయరావు

హిరమండలం: రైతులు పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయం డీపీఎం ధనుంజయరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో డివిజనల్ పరిధి ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి, ఐసీఆర్‌పీలతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంటను ఆశించే పురుగులు, తెగుళ్లు, వాటి నివారణ చర్యలను వివరించారు. మెక్కలు పెరగడానికి వినియోగించే ద్రావణాలను తెలియజేశారు. ఎన్ఎఫ్ఏలు శివాజీ, గోవిందరెడ్డి, ఎంటీలు సూర్యనారాయణ, చిన్నమ్ముడు ఉన్నారు.

తెంబూరులో దోమల నివారణ చర్యలు



ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

పాతపట్నం: తెంబూరు గ్రామంలో దోమల నివారణ చర్యలను శుక్రవారం చేపట్టారు. కాలువలు, పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాల చుట్టూ శుభ్రం చేసిన తరువాత దోమల నివారణ మందును ఫాగింగ్ చేశారు. పనులను సర్పంచ్ బెనియా వెంకటరమణ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి వాసు, సచివాల ఉద్యోగులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాలువలు పూడ్చివేత–రోడ్డుపైకి వర్షపునీరు



పొందూరు–రాపాక రోడ్డులో నిలిచిన నీరు

పొందూరు: మండలంలోని రాపాక–పొందూరు రహదారి పక్కనున్న కాలువను కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీంతో వర్షపునీరు వెళ్లే మార్గంలేక రోడ్లపైకి చేరుతుంది. గతంలో సుమారు పది అడుగుల కాలువ ఉండేది. ఈ రోడ్డు పక్కన నిర్మాణాలు చేసినవారు కాలువను ఆక్రమించేసి పూడ్చేశారు. అధికారులు కూడా పట్టించుకోలేదు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలతో నీరంతా రోడ్డుపైకి చేరుతుడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కాలువను పునరుద్ధరించాలని కోరుతున్నారు.